సాక్షి
అనకాపల్లి
బుధవారం । 15 । అక్టోబర్ । 2025





## అనంతుని పవిత్రోత్సవాలు

పద్మనాభంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి అనంత పద్మనాభ స్వామి పవిత్రోత్సవాలు జరగనున్నాయి. IIలో



## అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

## వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 32.4 నుంచి 32.6 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 23.7 నుంచి 24.3 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

## న్యూస్‌రీల్

### కలెక్టర్ పర్యటన వాయిదా

నక్కపల్లి: కలెక్టర్ విజయ్ కృష్ణన్ రాజయ్యపేట పర్యటన వాయిదా పడిందని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. మంగళవారం రాత్రి రాజయ్యపేట వచ్చి మత్స్యకారులకు ఈ విషయం తెలియజేశారు. బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు నెలరోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం మత్స్యకారులంతా నక్కపల్లి జాతీయ రహదారిపై 4 గంటలపాటు ధర్నా చేశారు. దీంతో ఆందోళన విరమింపజేసేందుకు కలెక్టర్ వారి వద్దకు వచ్చారు. బుధవారం గ్రామంలోకి వచ్చి మత్స్యకారుల డిమాండ్లు తెలుసుకుంటానని, తన పరిధిలో ఉన్న వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. కలెక్టర్ సమీప బంధువు మృతి చెందడంతో హుటాహుటిన కలెక్టర్ చెన్నై వెళ్లాల్సి రావడంతో రాజయ్యపేట పర్యటన తాత్కాలికంగా వాయిదా పడిందని, మళ్లీ ఎప్పుడు వచ్చేది త్వరలోనే తెలియజేస్తామని ఆర్డీవో తెలిపారు.

### రేపు పలు రైల్వే ప్రాజెక్టులకు శ్రీకారం

తాటిచెట్లపాలెం (విశాఖ): కర్నూలు నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు రైల్వే ప్రాజెక్టులను గురువారం వర్చువల్‌గా ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్‌కు సంబంధించిన కీలక ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. రైల్వే నిర్వహణను, సరకు రవాణాను మరింత వేగవంతం చేసేందుకు కొత్తవలస–విజయనగరం మధ్య నాల్గవ లైన్‌కు, అలాగే రైల్వేకు మరింత ఆర్థిక పరిపుష్టి, వేగవంతమైన రవాణా కోసం పెందుర్తి– నార్త్ సింహాచలం మధ్య అద్భుతమైన రైల్ ఫ్లై ఓవర్ వంతెనల పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అంతేకాకుండా, వాల్తేరు డివిజన్ పరిధిలో అత్యంత కీలకమైన కొత్తవలస–బొడ్డవర, శిమిలిగుడ–గోరాపుర్ మధ్య నిర్మించిన డబ్లింగ్ (రెండో లైన్) ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టుల ప్రారంభం వలన ఈ సెక్షన్‌లో ప్రయాణికుల రవాణా, సరకు రవాణా మరింత వేగవంతంగా, సుఖంగా, సురక్షితంగా చేపట్టవచ్చని అధికారులు తెలిపారు.

### అనకాపల్లి జిల్లాలో సెక్టోరల్ ఆఫీసర్ల నియామకంపై విచారణ

మధురవాడ (విశాఖ): అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష విభాగంలో సెక్టోరల్ ఆఫీసర్‌ల నియామకాల్లో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుపై మధురవాడలోని విద్యా శాఖ ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ విజయభాస్కర్ మంగళవారం విచారణ ప్రారంభించారు. జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ల నియామకాల్లో సీనియారిటీ, వయస్సు వంటి నిబంధనలు సక్రమంగా పాటించకుండా వ్యవహరించారని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌పీడీకి ఫిర్యాదు చేశారు. ఎస్‌పీడీ ఆదేశాల మేరకు ఇరు పక్షాలను విచారణకు పిలిచినట్టు అధికారులు తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతోందని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆర్‌జేడీ విజయభాస్కర్ వెల్లడించారు.





రాజయ్యపేటతీరంలో ఇసుక ప్రతిమలు చేసి పూజలు నిర్వహిస్తున్న మహిళలు (ఇన్‌సెట్) పసుపు కుంకుమలు కలిపిన నీళ్లను సముద్రంలో కలుపుతున్నమహిళలు

# నీ చెంతనే బతుకుతున్నాం.. కాపాడు తల్లీ..

నక్కపల్లి : 'గంగమ్మతల్లి నిన్నే నమ్ముకున్నాం.. నీ చెంతనే బతుకుతున్నాం.. నీవిచ్చిన మత్స్య సంపదే ఆధారం.. మమ్మల్ని బల్క్ డ్రగ్ పార్కు నుంచి కాపాడు తల్లి' అంటూ రాజయ్యపేట మత్స్యకార మహిళలు మంగళవారం తీరంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆరాధ్య దైవం నూక తాతపై కూడా భారం వేస్తూ వేడుకున్నారు. మంగళవారం ఉదయం వందలాది మంది మహిళలు సముద్రపు ఒడ్డుకు చేరుకున్నారు. ఇసుకతో గంగమ్మతల్లి, నూకతాత విగ్రహాలను తయారు చేశారు. వాటికి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు.

**తీరంలో గంగమ్మకు, నూకతాతకు ప్రత్యేక పూజలు**

బిందెలతో నీళ్లు తెచ్చి పసుపు, కుంకుమ వేసి ఆ నీటిని, ఇసుకతో తయారు చేసిన విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేశారు. గంగమ్మతల్లి.. బల్క్ డ్రగ్ పార్క్ నీ నుంచి మమ్మల్ని దూరం చేయబోతోంది.. ఇంత కాలం నీ నీడలో బతుకుతున్నాం .. నువ్విచ్చిన సంపదతో కడుపు నింపుకొంటున్నాం.. నీ నుంచి మమ్మల్ని దూరం చేసే ప్రయత్నాలకు కూటమి ప్రభుత్వం ఒడిగడుతోంది..

**బల్క్ డ్రగ్ పార్కు రద్దు చేయాలంటూ మత్స్యకారుల వేడుకోలు**

నిన్ను కలుషితం చేయాలని చూస్తున్నారు.. నువ్వే కాపాడాలమ్మా అంటూ ప్రార్థించారు. 'నూకతాత.. ఇప్పటి వరకు ప్రతి ఏటా శివరాత్రికి నీ పండగ ఘనంగా చేసే వాళ్లం.. వచ్చే ఏడాది నుంచి ఆ పరిస్థితి ఉండదు. మా ప్రాణాలు తీసే ప్రమాదకరమైన రసాయన పరిశ్రమలను బల్క్ డ్రగ్ పేరుతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది.. మేమంతా పొట్ట చేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు పోయే పరిస్థితి కల్పిస్తోంది. నువ్వే దిక్కు మమ్మల్ని కాపాడాలి. నీపైనే భారం వేస్తున్నాం' అంటూ వేడుకున్నారు. అలాగే గ్రామంలో ఉన్న బాకీర్తమ్మ ఆలయం వద్ద కూడా మహిళలు పూజలు చేశారు. అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ఆలయం ముందు ఉన్న మెట్లపై నీళ్లు పోసి అమ్మవారిని బల్క్ డ్రగ్ భూతం నుంచి కాపాడాలంటూ వేడుకున్నారు. ఈ పూజల్లో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పైడితల్లి, మసేనమ్మ, పోలమ్మ, మహాలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రంలో

## తనిఖీలు



ఎ.కొత్తపల్లిలో బాణసంచా తయారీ కేంద్రంలో తనిఖీ చేపడుతున్న అధికారుల బృందం

దేవరాపల్లి: మండలంలోని ఎ. కొత్తపల్లి బాణాసంచా తయారీ కేంద్రాన్ని అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ అధికారుల బృందం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. బాణసంచా తయారీలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. పేలుడు పదార్థాల నిల్వ, కార్మికుల రక్షణ చర్యలు, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి ఆదేశించారు. ఈ తనిఖీలలో చోడవరం అగ్నిమాపక కేంద్రం అధికారి పి.వి.రామస్వామి, పీఆర్ ఏఈ సుమిత్ర, పోలీస్ కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

## వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్‌గా హరేందిరప్రసాద్ బాధ్యతల స్వీకరణ

విశాఖ సిటీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ఇన్‌చార్జి కమిషనర్‌గా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన కె.ఎస్.విశ్వనాథన్‌ను ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మెట్రోపాలిటన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి పనుల స్థితిగతులపై చర్చించారు.



వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్ హరేందిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న చైర్మన్ ప్రణవ్‌గోపాల్

## సీపీఆర్‌పై అవగాహన

అనకాపల్లి: ప్రభుత్వ ఆయుష్, ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో కార్డియోపల్మోనరీ రిససిటేషన్(సీపీఆర్)పై ఈ నెల 19వ తేదీ వరకూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయుర్వేద జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.లావణ్య తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో ఆయుష్మాన్ వైద్యాలయంలో రోగులకు సీపీఆర్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్స ప్రక్రియ సీపీఆర్ అని చెప్పారు.

గుండె, మెదడు వంటి ప్రధాన అవయవాలకు రక్తం సరఫరా అయ్యేలా చేయడానికి ఛాతీపై పుష్ అప్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాలయం ఫార్మాసిస్ట్ గణేష్, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ కె.లావణ్య, తదితరులు

# మా దారి.. అడ్డదారి!

'అచ్యుతాపురం సెజ్‌లో ఎవరి భూమైనా మాకు అవసరమైతే నిబంధనలు వర్తించవు. అధికారులు సైతం మేం చెప్పిందే వినాలి. మేమిచ్చే పరిహారం తీసుకొని మేం కోరిన భూమిని వదిలేయాల్సిందే'

ఇది అచ్యుతాపురం సెజ్‌లో అధికార పార్టీ నేతల ఆగడాలకు మచ్చుతునక మాత్రమే.

- రైతు భూమిని ఆక్రమించి రోడ్డు నిర్మాణ పనులు
- ప్రజా ప్రతినిధి సోదరుడి అండతో అడ్డగోలు వ్యవహారాలు
- పరిహారం చెల్లించకుండానే ఓ బడా కంపెనీ దందాలు
- అడ్డదారిలో మూడో వంతు చెల్లించి భూమిని కొట్టేసే ప్రయత్నం
- కోర్టు ఉత్తర్వులు అనుకూలంగా ఉన్నా రైతుకు దక్కని న్యాయం

రాంబిల్లి (అచ్యుతాపురం): అధికారం ఇచ్చినందుకు ప్రజల సేవలో నిమగ్నం కావాల్సిన వారు.. వారిని పీడించడంలో తమ వీరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. రాంబిల్లి మండలంలోని కొత్త కొడూరు శివారు చాటమెట్ట రెవెన్యూ పరిధిలో ఓ బడా కంపెనీ ఉంది. గ్రామ సభ అనుమతి లేకుండానే ప్రారంభానికి సిద్ధమవుతున్న ఓ ఫార్మా కంపెనీతో అనుసంధానమై అడ్డగోలుగా రోడ్డు నిర్మిస్తోంది. రోడ్డు నిర్మాణ కాంట్రాక్టు స్థానిక ప్రజా ప్రతినిధి సోదరుడికి ఇవ్వడంతో వారికి పాలకుల అండ మరింత పెరిగింది. సుమారు 600 మీటర్ల పొడవున వేయనున్న రహదారి 2.96 ఎకరాల స్థలంలో నుంచి సాగుతుంది. ఇందులో 56 సెంట్ల భూమి లాలం అప్పలనాయుడు సాగులో ఉంది. కొత్త కొడూరు శివారు చాటమెట్ట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 332–1బీలో 2.76 ఎకరాలు, 333–1బీలో 0.85 ఎకరాలు, 333–2లో 2 ఎకరాల భూమి 4 (సీ)గా నమోదై ఉంది. ఈ భూమిని నాలుగు దశాబ్దాల క్రితమే లాలం అప్పలకొండ సాగులో ఉన్నట్లు రెవెన్యూ పరమైన ధ్రువీకరణ ఉంది. లాలం అప్పలకొండ మరణాంతరం ఆయన కుమారుడు లాలం అప్పలనాయుడు సాగు చేస్తున్నారు. తన అనుమతి లేకుండా, తనకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా తన స్థలంలోని 56 సెంట్లను అనధికార రోడ్డు కోసం ఆక్రమించడంపై ఆయన అభ్యంతరం చెబుతున్నారు. నిబంధనల ప్రకారం రోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకొని, రెవెన్యూ వారు భూ సేకరణ చేసి, పరిహారం ఇస్తే అతనికి దాదాపు రూ.10 లక్షల వరకు అందాల్సి ఉంది. కానీ అదేమీ లేకుండానే దసరా నుంచి పనులు ప్రారంభించారు.

**అడ్డదారిలో రూ.3.82 లక్షలు ఇవ్వడమేంటి ?**

ఆక్రమణల్లో వీరత్వాన్ని ప్రదర్శిస్తున్న బడా కంపెనీ తన ఫౌండేషన్ ద్వారా రూ.3.82 లక్షలను సదరు అప్పలనాయుడు ఖాతాలో వేసింది. తనకు న్యాయంగా రావలసిన 10 లక్షల బదులు అడ్డదారిలో అందులో మూడో వంతు ఇవ్వడమేంటని బాధిత రైతు ప్రశ్నిస్తున్నారు. ఆయన రహదారి నిర్మాణ పనుల్ని అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు రంగంలోకి దిగి కంపెనీ తరఫున వత్తాసు పలుకుతున్నారు.

**గ్రామ సభ ఆమోదం లేని కంపెనీకి అడ్డగోలు రహదారా?**

బడా కంపెనీకి అనుసంధానంగా ఏర్పాటవుతున్న ఫార్మా కంపెనీకి ఎటువంటి గ్రామ సభ ఆమోదం లేదు. అయినా అడ్డగోలుగా రోడ్డు వేయడంతో పలు అనుమానాలు మొదలవుతున్నాయి. బాధితునికి అండగా నిలవాల్సిన రెవెన్యూ, పోలీస్ వర్గాలు మిన్నకుండిపోవడంపై స్థానికంగా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. దసరా నుంచి రోడ్డు పనులు ఊపందుకున్నాయి. ఇటువంటి ఉపద్రవాన్ని ముందే గ్రహించిన బాధితుడు ఈ ఏడాది ఏప్రిల్ 28న హైకోర్టును ఆశ్రయించి భూమిపై హక్కులు ఉన్నట్లు ఉత్తర్వులు పొందారు. ఇటీవల కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఐదు నెలలుగా సాగుతున్న ఈ వివాదం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది.



వివాదంగా మారిన రోడ్డు ఇదే..

### ఉద్యమం.. ఉధృతం



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే, త్వరలో ఈ ప్రాంత కూటమి ఎంపీలు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం. ఎన్నికల ముందు ప్రైవేటీకరణకు వ్యతిరేకమని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు దగ్గరుండి ప్రైవేటీకరణకు సహకరిస్తున్నారు. ఉత్తరాంధ్ర ఆత్మగౌరవమైన స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుతున్నా కూటమి ప్రజాప్రతినిధులు నోరు మెదపడం లేదు. వైఎస్సార్, వైఎస్ జగన్ హయాంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి జరిగింది. చంద్రబాబు మళ్లీ అభివృద్ధిని అమరావతికే కేంద్రీకరించి, వేలాది కోట్లు అప్పు చేసి ఉత్తరాంధ్రకు అన్యాయం చేస్తున్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు. విశాఖలో విలువైన భూములను లూలూ, ఉర్సా వంటి సంస్థలకు కారుచౌకగా ఇస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ కర్మాగారం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడానికి మేధావులు, రాజకీయ నేతలు ఐక్యంగా పోరాడాలి.

–కె.కె.రాజు,
వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు

స్టీల్, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఉమ్మడి పోరు

# నోరెత్తని నేతల ఇళ్ల ముట్టడి



వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం | హాజరైన ఆయా యూనియన్ల నాయకులు, న్యాయవాదులు, రాజకీయనేతలు

ఉక్కు ఉక్కు, వైద్య కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకునేలా ఐక్య పోరాటం చేయాలని మేధావులు, న్యాయవాదులు, రాజకీయ నేతలు నిర్ణయించారు.'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో ప్రజలంతా ఉద్యమిస్తేనే స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ పోరాటాన్ని ఉధృతం చేసేందుకు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలతో కలిసి అఖిల పక్ష రాజకీయ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంగళవారం విశాఖలోని పౌర గ్రంథాలయంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశానికి ప్రముఖ న్యాయవాది పాక సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

– సాక్షి, విశాఖపట్నం

### వందేళ్ల తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాల



ఉత్తరాంధ్ర ప్రాంతంలో 1921లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత ఇదే ప్రాంతంలో అనకాపల్లి, పాడేరుతో పాటు రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటి ద్వారా 2,550 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉంటాయి. పీజీ వైద్య కోర్సులూ వస్తాయి. వీటిని పీపీపీలో నిర్వహించాలనుకోవడం ఆక్షేపణీయం

– పాక సత్యనారాయణ,
వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి

### కీడు చేస్తున్న చంద్రబాబు



రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తమకు అనుకూలమైన తాబేదారులకు అప్పగించేందుకే కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని ఏనాడూ అడ్డుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యమ టెంట్‌ను కూడా తొలగించి అణిచివేస్తోంది.

– రామారావు, సీఐటీయూ నేత

### సంపూర్ణ బంద్‌కు పిలుపు



కూటమి ప్రభుత్వం రాజ్యాంగంలోని 'సోషలిస్ట్' అంశాన్ని కాలరాస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేయాలి. స్టీల్ ప్లాంట్, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి నగరంలో ఒక రోజు సంపూర్ణ బంద్ పాటించాలి. వేల కోట్లు అప్పు చేసి అమరావతి నిర్మాణం చేస్తున్నప్పుడు, పేదలకు ఉచిత వైద్యం అందించే మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం అన్యాయం. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కమిటీ వేసి పోరాటం చేస్తే తాము తప్పకుండా పాల్గొంటాం.

– డాక్టర్ ఎస్‌డీ పాల్,
ఆల్ ఇండియా బహుజన మేధావుల సమైక్య అధ్యక్షుడు

### అమ్మేయడం..తీసేయడం..



కేంద్ర ప్రభుత్వ ఆశయం, లక్ష్యం దేశంలో ప్రభుత్వ సంస్థలను అమ్మేయడం, మూసేయడం, ఉద్యోగాలను తీసేయడమే. దేశవ్యాప్తంగా విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి 142 కంపెనీలను అమ్ముతున్నారు. చిన్న కంపెనీలను మూసేస్తున్నారు. మైనింగ్ పేరిట కొండలు, సంపదను లాగేసుకుంటున్నారు. అడ్డుపడితే మావోయిస్టుల పేరుతో చంపేస్తున్నారు. ఇటీవల విశాఖలో మోదీ, చంద్రబాబు యోగా కార్యక్రమం నిర్వహించడానికి కారణం – తాము ఏమి చేసినా దేశ ప్రజలు అవయవాలు మూసుకుని, ఊపిరి పీల్చుకోవాలే తప్ప ప్రశ్నించకూడదు అనేదే వారి ఆశయంలా ఉంది.

– శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ నాయకుడు

### ఉద్యమాన్ని అణిచివేసే కుట్ర



ఎంతో మంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తామంటే చూస్తూ ఊరుకోబోం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఉద్యమ టెంట్‌ను తొలగించి ఉద్యమాన్ని లేకుండా చేసేందుకు ప్రయత్నాలు చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులను తొలగించడం, ఉద్యమాన్ని లేకుండా చేయడమే పనిగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

– ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకుడు

### 'లా నేస్తం' ఎత్తివేతతో ఇబ్బందులు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'లా నేస్తం' పథకం ద్వారా ప్రాక్టీస్ చేసే జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేలు అందేవి. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తేయడంతో జూనియర్ న్యాయవాదులు జీవనం కోసం ప్రైవేట్, మార్కెటింగ్ కంపెనీల్లో చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో లాయర్ల కోసం కేటాయించిన కార్పస్ ఫండ్‌కు కూడా కూటమి ప్రభుత్వం టోకరా పెట్టింది. లీగల్ సెల్ తరఫున మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం.

– బాజీనాయుడు,
వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు

### ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరిట దుష్ప్రచారం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచి పనులను కూడా కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోంది. కేంద్రం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నెట్టి తప్పుడు ప్రచారం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చేవరకు ప్రజా ఉద్యమాలు నిర్వహించి, ఈ ప్రాంతంలోని విశాఖ స్టీల్ ప్లాంట్, మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుంటాం.

– నీరుకొండ రామచంద్రరావు,
స్టీల్ ప్లాంట్ ఉద్యమ నాయకుడు

## క్లుప్తంగా

### గంబూషియాతో దోమల లార్వా నివారణ



చెరువులో గంబూషియా చేప పిల్లలు విడిచి పెడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

**కోటకోట:** జ్వరాల నివారణకు ఉపకరించే చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హైమావతి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెరువుల్లో దోమల నివారణకు ఉపయోగపడే గంబూషియా చేప పిల్లలను మంగళవారం ఆమె విడిచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంబూషియా చేపలు మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులకు కారణమయ్యే దోమల లార్వాల నివారణకు దోహదపడతాయన్నారు. దీంతో మంచినీటి చెరువుల్లో ఈ చేపల వృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. దోమలు వృద్ధి చెందకుండా, జ్వరాలు సోకకుండా పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి సీహెచ్. గీత సత్యప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ప్రమాదస్థాయిలో కోనాం నీటిమట్టం

**చీడికాడ:** మండలంలోని కోనాం జలాశయం పరిసరాల్లో సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షంతో ఇన్‌ఫ్లో భారీగా పెరగడంతో జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరువకు చేరుకున్నట్టు ఇన్‌చార్జి ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ప్రస్తుతం నీటిమట్టం 99.80 మీటర్లకు మంగళవారం సాయంత్రానికి చేరుకుంది. అయితే ఇన్‌ఫ్లో ఒక్కసారిగా 275 క్యూసెక్కులకు పెరగడంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నుంచి ప్రధాన గేట్లు ద్వారా దిగువకు 160 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇన్‌ఫ్లోను బట్టి రాత్రికి నీటి విడుదలను పెంచే అవకాశం ఉందన్నారు.

### 'విద్యా సంస్థల్లో సౌకర్యాల లేమి'

**అనకాపల్లి టౌన్:** జిల్లాలో అనేక స్కూళ్లు, కళాశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు విమర్శించారు. మంగళవారం జిల్లాలోని పలు పాఠశాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ పలు విద్యా సంస్థల్లో మరుగుదొడ్ల కొరతతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లకు సరైన తలుపులు కూడా లేవన్నారు. వీటిపై తక్షణమే విద్యా శాఖాధికారులు పర్యవేక్షణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇంటి పన్నుల సొమ్ము స్వాహా

- దేవరాపల్లి పంచాయతీలో భారీగా నిధులు గోల్‌మాల్?
- బిల్ కలెక్టర్‌పై పంచాయతీ ఈవో ఫిర్యాదుతో వెలుగులోకి..
- కార్యాలయ సిబ్బంది హస్తంపై అనుమానాలు
- లోతుగా విచారణ చేస్తే మరింత అవినీతి బయటపడే అవకాశం

**దేవరాపల్లి:** తన అవినీతి ఆరోపణలపై విచారణ జరుగుతుండగానే మునగపాక నుంచి దేవరాపల్లికి బదిలీపై వచ్చిన బిల్ కలెక్టర్ మరోమారు వక్రబుద్ధి ప్రదర్శించారు. ఇక్కడ ప్రజల నుంచి వసూలు చేసిన ఇంటి పన్నుల సొమ్ము ప్రభుత్వానికి చెల్లించకుండా స్వాహా చేశారు. ఇందులో ఇతర సిబ్బంది హస్తం ఉందని తెలుస్తోంది. ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శి అనంత ఉమాదేవి, ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు వేర్వేరుగా జిల్లా పంచాయతీ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఈ బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మునగపాక పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పనిచేసిన జె.జోగిరాజుపై వివిధ అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ విచారణ జరుగుతుండగానే ఆయన్ను గతేడాది అక్టోబర్‌లో దేవరాపల్లి పంచాయతీకి బదిలీ చేశారు. మునగపాకలో ప్రజలు చెల్లించిన ఇంటి పన్ను సొమ్ములో రూ. 4.45 లక్షలు మేర జోగిరాజు స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలోనే దేవరాపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న అతడిపై మే 26న డీపీవో సస్పెన్షన్ వేటు వేశారు. అప్పటి నుంచి అతని స్వాధీనంలో ఉన్న రికార్డులను, బీరువా తాళాలను సైతం నేటి వరకు అప్పగించలేదు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు స్థానిక పంచాయతీ ఈవో అనంత ఉమాదేవి చేసిన పలు ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అతనిపై దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో జూన్ 6న ఆమె ఫిర్యాదు చేయగా తిరస్కరించారు. డీపీవో, ఎంపీడీవో నుంచి ఫిర్యాదు వస్తే తప్పా తాము స్వీకరించలేమని పోలీసులు చెప్పినట్టు ఆమె తెలిపారు.



దేవరాపల్లి పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సచివాలయం భవనం ఇదే..

**గతేడాది ఇంటి పన్ను సొమ్ము రూ. 6 లక్షలే జమ**

దేవరాపల్లి పంచాయతీలో గత ఆర్థిక సంవత్సరం రూ. 13 లక్షల మేర ఇంటి పన్ను వసూలు కావాల్సి ఉంది. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మే 25వ తేదీ వరకు రూ. 6 లక్షలు మేర మాత్రమే బ్యాంక్‌లో జమ అయ్యింది. మిగిలిన సొమ్ములో ఎంత మేర వసూలు అయ్యిందో అనే దానిపై పూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది. తమ వద్ద ఉన్న ప్రాథమిక సమాచారంతో ఇంటి పన్ను చెల్లించాలంటూ కొంతమందికి పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఫోన్ చేయగా, వారి ఇంటి పన్ను చెల్లించిన రసీదు తెచ్చి చూపిస్తుండటంతో ఈవో నివ్వెరపోతున్నారు. దీంతో మునగపాక పంచాయతీ మాదిరిగానే దేవరాపల్లిలోనూ బిల్ కలెక్టర్ స్వాహా చేసి ఉంటాడన్న అనుమానాన్ని ఆమె వ్యక్తం చేస్తున్నారు. అతడిపై ఎంపీడీవోకి గత నెల 20న లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజును వివరణ కోరగా, పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు బిల్ కలెక్టర్‌పై డీపీవోకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవినీతి బాగోతంపై డీపీవో ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

**అవినీతి వెనుక ఎవరెవరి హస్తాలున్నాయో...**

స్థానిక పంచాయతీపై ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తగా, ఇంటి నిర్మాణ అనుమతుల పేరిట పెద్ద ఎత్తున కొందరు అనధికారికంగా వసూళ్లకు పాల్పడ్డారని కొన్నేళ్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వెలుగు చూసిన అవినీతి ఆరోపణలతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి పంచాయతీలో జరిగిన అవినీతి లక్షల్లో ఉంటుందని విశ్వసనీయ సమాచారం. పంచాయతీలో అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేపడితే నిధులు దుర్వినియోగం సహా అవినీతి బట్టబయలవుతుంది. ఈ అవినీతి వెనుక ఎవరెవరి హస్తాలు ఉన్నాయో ఉన్నతాధికారులు విచారించి నిగ్గు తేల్చాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు.

# అనంతుని పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు



కుంతీ మాధవ స్వామి ఆలయం (ఇన్‌సెట్) శాంతి కల్యాణం జరపనున్న అనంతుని ఉత్సవ విగ్రహాలు

- 18న స్వామికి పవిత్రాలు సమర్పణ
- శ్రీరంగం నుంచి ఇప్పటికే చేరిన పవిత్రాలు
- 19న పవిత్రాల విసర్జన, శాంతి కల్యాణం

**పద్మనాభం:** స్థానిక కుంతీ మాధవస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 19 వరకు అనంత పద్మనాభస్వామి పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పవిత్రోత్సవాలకు అవసరమయ్యే పవిత్రాలను తమిళనాడులోని శ్రీరంగం నుంచి తీసుకొచ్చి, ఆలయంలో భద్రపరిచారు. నూతన వస్త్రాలు సమకూర్చారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 17న అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ఠాపన, నిత్య హోమాలు, మూల మంత్రహోమం, పవిత్రాలకు అభిమంత్రణ, మహాశాంతి హోమం జరుపుతారు. 18న అష్ట కలశ స్నపన, పంచామృత అభిషేకాలు, నిత్య హోమం అనంతరం శ్రీరంగం నుంచి తెచ్చిన పవిత్రాలను స్వామికి సమర్పిస్తారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలోని కుంతీ మాధవస్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి పెద్ద ఉత్సవ విగ్రహాలకు, చిన్న ఉత్సవ విగ్రహాలకు, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, గోదాదేవి, లక్ష్మీదేవి, గిరిపై ఉన్న అనంత పద్మనాభ స్వామికి పవిత్రాలు సమర్పిస్తారు. పవిత్రాల అలకరణలో ఈ మూర్తులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. 19న ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం అనంతరం పవిత్రాలను విసర్జింప చేస్తారు. పూర్ణాహుతి నిర్వహించి, కుంతీ మాధవస్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా రూపొందించిన వేదిక వద్దకు తోడ్కొని వస్తారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉదయం 11 గంటలకు శాంతి కల్యాణంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

# నిరుద్యోగులకు స్వయం ఉపాధి శిక్షణ

**అనకాపల్లి:** గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు ఎస్‌బీఐ ముంబాయి కార్పొరేట్ సెంటర్ చీఫ్ జనరల్ మేనేజర్ గోవింద్ నారాయణ గోయల్ తెలిపారు. స్థానిక పూడిమడక రహదారిలో ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కార్యాలయంలో ఉచిత బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మాత్రమే ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతోపాటు దుకాణాల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం మాణిక్యాంబ, శిక్షణ ఆర్‌ఎం మహాపాత్ర, బ్యాంక్ ఉద్యోగులు కె.రమేష్, శిక్షణ డైరెక్టర్ రాజేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బ్యూటీపార్లర్ శిక్షణలో మాట్లాడుతున్న గోవింద్ నారాయణ గోయల్

# ప్రభంజనంలా కోటి సంతకాల సేకరణ



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్



మునగపాకలో కోటి సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, పక్కన ధర్మశ్రీ, బొడ్డేడ తదితరులు

- మునగపాకలో ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

**మునగపాక:** మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తేటతెల్లమైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు మంగళవారం మునగపాకలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన 17 మెడికల్ కళాశాలల్లో ఏడు నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులకు వైద్య కళాశాల అనువుగా ఉండేలా, సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి నిర్మాణాల ద్వారా మెరుగైన వైద్య సేవలందించేలా జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. ఇటీవల మాకవరపాలెంలో మెడికల్ కళాశాలను సందర్శించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి వస్తే పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా భారీగా ప్రజలు, కార్యకర్తలు రావడం సంతోషకరమన్నారు. కూటమి ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో ఇదే నిదర్శనమన్నారు. కోటి సంతకాల సేకరణ పూర్తయిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గవర్నర్‌కు అందజేయనున్నామన్నారు. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ మండలంలోని 10 వేల నుంచి 15 వేలకు తగ్గకుండా సంతకాలు సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ మునగపాక మండలంలో సంతకాల సేకరణ ఉద్యమంలా సాగాలన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యానాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, సుందరపు తాతాజీ, కర్రి పెదబ్బాయి, కారుకొండ రాజు, ఎంపీటీసీలు మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, మద్దాల వీరునాయుడు, ఇల్లా నాగేశ్వరరావు, బొడ్డేడ బుజ్జి, బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, షేక్ ఇస్మాయిల్, దొడ్డి బాలాజీ, బొద్దపు శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

- గంజాయితోపాటు 2 బైక్‌లు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం

**నాతవరం:** గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం నాతవరం పోలీసు స్టేషన్‌లో నిందితుల వివరాలను నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్. రేవతమ్మ వెల్లడించారు. నాతవరం మండలం చమ్మచింత వద్ద ఎస్‌ఐ వై. తారకేశ్వరరావు తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో రెండు బైకులపై వచ్చిన నిందితులు వారిని చూసి పారిపోతుండగా, ఎస్‌ఐ వెంబడించి చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల వద్ద బ్యాగ్‌లు తనిఖీలు చేయగా గంజాయి లభ్యమైంది. రెండు బైక్‌లతోపాటు నలుగురిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. ఒడిశాలో జనతాపాయ్ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి ఏజెన్సీ మీదుగా మైదాన ప్రాంతానికి రవాణా చేసి అధిక ధరకు అమ్ముతున్నట్లుగా విచారణలో అంగీకరించారు. పట్టుబడిన వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంతలగుమ్మి గ్రామానికి చెందిన చింతల బుజ్జిబాబు, వంతల ఈశ్వర్, తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లాకు చెందిన కూతాటి శివకుమార్, నల్లగొండ జిల్లా కేంద్రం అబ్బానియా కాలనీకి చెందిన మహమ్మద్ ఫుర్ఖాన్ ఉన్నారు. వారి నుంచి కేజీ లిక్విడ్‌తోపాటు ఐదు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ మార్కెట్ రేటు ప్రకారం రూ. 5 లక్షలుపైగా ఉంటుందని సీఐ తెలిపారు. ఎస్‌ఐ తారకేశ్వరరావుతోపాటు సిబ్బందిని అభినందించారు.



నిందితులతో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్‌ఐ తారకేశ్వరరావు

## అంత్యక్రియలకు వెళ్లి.. గోస్తనీలో వ్యక్తి గల్లంతు

**తగరపువలస:** ఆత్మహత్యకు పాల్పడ్డ బావ అంత్యక్రియల అనంతరం, గోస్తనీ నదిలో స్నానానికి దిగి గల్లంతయిన ఘటన మంగళవారం జరిగింది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్‌కు చెందిన పీసా త్రిమూర్తులు సోమవారం తన ఇంట్లో ఉరేసుకుని మరణించాడు. అతని అంత్యక్రియలు మంగళవారం బాలాజీనగర్ శ్మశానవాటికలో జరిగాయి. ఈ అంత్యక్రియలకు హాజరైన మృతుడు త్రిమూర్తులు మేనత్త కొడుకు తమ్మిన శ్రీను(36), అంత్యక్రియల అనంతరం గోస్తనీలో స్నానానికి దిగినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నదీ ప్రవాహం ఎక్కువగా ఉండటంతో శ్రీను కొట్టుకుపోయినట్లు పేర్కొన్నారు. నదిలో సాయంత్రం వరకు బంధువులు గాలించినా ఆచూకీ లభించలేదు. శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'ఏపీ ఎక్సైజ్ సురక్ష'తో కల్తీ మద్యానికి చెక్

**అనకాపల్లి :** వైన్ షాపుల్లో విక్రయిస్తున్న మద్యం కల్తీదా? నాణ్యమైనదా అని 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ ద్వారా తెలుసుకోవచ్చని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి సుధీర్ తెలిపారు. మొబైల్‌లో ప్లేస్టోర్ ద్వారా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, షాపుల్లో కొనుగోలు చేసిన లిక్కర్ బాటిల్ మూతపై అతికించిన స్టిక్కర్‌కు ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మొత్తం సమాచారం వస్తుందన్నారు. సమాచారం రాకపోతే కల్తీ మద్యంగా భావించాలని చెప్పారు. ఈ యాప్‌తో బీరు బాటిల్‌ను స్కాన్ చేస్తే ఎటువంటి సమాచారం రాదని, లిక్కర్ బాటిల్స్ స్కాన్ చేయడానికి మాత్రమే ఉపయోగపడుతుందని వివరించారు.

## బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు

**యలమంచిలి రూరల్:** పట్టణంలోని పార్కు పక్కన ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో పాన్ షాపులో మద్యం విక్రయిస్తున్న కొర్రా నూకరాజుపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి పట్టణ ఎస్సై బి. రామకృష్ణ తెలిపారు. నిందితుడు వద్ద నుంచి పది మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్టు షాపు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సజ్జల దృష్టికి బల్క్ డ్రగ్ పార్క్ ఉద్యమం



సజ్జలను కలిసిన వీసం, చిక్కాల, దంతులూరి తదితరులు

**నక్కపల్లి:** మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఉద్యమాన్ని వైఎస్సార్‌సీపీ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి, సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి స్థానిక పార్టీ నేతలు తీసుకెళ్లారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, దంతులూరి దిలీప్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా నెల రోజుల నుంచి మత్స్యకారులు చేస్తున్న నిరాహారదీక్ష, జాతీయ రహదారి దిగ్బంధనం వంటి ఆందోళనలను వారు వివరించారు. శాంతియుతంగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనపై ప్రభుత్వం, పోలీసులు అనుసరిస్తున్న వైఖరి, కేసులు నమోదు, మత్స్యకారులకు మద్దతు తెలిపేవారిని అడ్డుకోవడం, గృహ నిర్బంధం చేయడం వంటి వాటిని తెలియజేశారు. ఈ నేపథ్యంలో నర్సీపట్నం మెడికల్ కళాశాల సందర్శనకు వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక మత్స్యకారులతో కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. బల్క్ డ్రగ్ పార్క్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపుల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఆయనకు వివరించామన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయలేదని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ రెండో దశ కోసం అదనంగా ప్రభుత్వం భూసేకరణకు సన్నాహాలు చేస్తోందని, రైతులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. బల్క్ డ్రగ్‌కు వ్యతిరేకంగా నెల రోజుల నుంచి జరుగుతున్న ఉద్యమం వివరాలను సజ్జలకు అందజేసి, పార్టీ తరఫున మత్స్యకారులకు అండగా నిలవాలని కోరారు. సజ్జలను కలిసిన వారిలో పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకుడు పైలా శ్రీనివాసరావు, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, పార్టీ నాయకుడు తళ్ల భార్గవ్ తదితరులు ఉన్నారు.

# పరారై ఆరేళ్ల తర్వాత చిక్కిన హత్యకేసు నిందితుడు

**ఆరిలోవ:** కోర్టు కేసు నడుస్తుండగా ఆరేళ్ల క్రితం పరారైన ఓ హత్య కేసులోని ప్రధాన నిందితుడిని ఆరిలోవ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఎన్ని చోట్ల గుట్టుగా గడిపినా చివరికి వెతికి పట్టుకుని, కటకటాల వెనక్కి పంపించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ద్వారకా జోన్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి మంగళవారం మీడియాకు తెలిపిన వివరాలు.. ఆరిలోవ ప్రాంతం ప్రియదర్శినికాలనీ, సెయింట్ ఆన్స్ స్కూల్ వెనుక 2011 జూన్ 12న పందిరి రవి అలియాస్ చిత్తిరి రవి హత్యకు గురయ్యాడు. పాత కక్షల కారణంగా రవిని బాలాజీనగర్‌కు చెందిన తిరుమల రాఘవరాజు(ప్రస్తుత వయసు 40)తో పాటు మరో ఆరుగురు కలసి కత్తులతో దాడిచేసి సినీ ఫక్కీలో హత్య చేశారు. ఈ కేసులో ఏడుగురు ముద్దాయిలను ఆరిలోవ పోలీసులు అప్పట్లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అదే ఏడాది జూలై 1న వారిపై రౌడీ షీట్లు తెరిశారు. కోర్టులో కేసు నడుస్తుండగా ఏ1 ముద్దాయి రాఘవరాజు 2019 జూలై 24 నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కాలేదు. రౌడీ షీట్ ఉన్నందున పోలీస్ స్టేషన్‌కూ వెళ్లకుండా పరారయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు అతని కోసం ఎంత గాలించినా పట్టుబడలేదు. దీంతో కోర్టు 2023 మార్చి 10న మిగిలిన ఆరుగురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అప్పటికే ఈ కేసులో ఉన్న ముగ్గురు ముద్దాయిలు మరణించారు. మిగిలిన ముగ్గురు ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ పీడీబీ శంకర్, పీఎస్‌ఐ వరహాలు నాయుడు, కానిస్టేబుల్ జి.అప్పారావు బృందం ఆరు నెలల పాటు ప్రత్యేక నిఘా పెట్టారు. డిజిటల్ వాచ్ చేపట్టారు. చోడవరం ప్రాంతంలో ముద్దాయి ఓ క్వారీలో కూలీగా పనిచేస్తున్నట్లు తెలుసుకుని అక్కడకు చేరుకొన్నారు. పోలీసుల ఆచూకీ గమనించిన ముద్దాయి అక్కడి నుంచి అనకాపల్లి ప్రాంతానికి చేరుకుని కొన్నాళ్లు ట్యాక్సీవాలా అవతారం ఎత్తాడు. అతని ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు అనకాపల్లి మారుమూల గ్రామంలో మంగళవారం తిరుమల రాఘవరాజును పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ నర్సింహమూర్తితో పాటు సీపీ శంఖబ్రత బాగ్చి ఫోన్‌లో సీఐ మల్లేశ్వరరావు బృందాన్ని అభినందించారు.



ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహమూర్తి



పట్టుబడిన రాఘవరాజు

# 'కె-ర్యాంప్' ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

- హీరో కిరణ్ అబ్బవరం

**డాబాగార్డెన్స్:** సక్సెస్‌ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కె-ర్యాంప్'. ఈ చిత్రాన్ని హాస్య మూవీస్, రుద్రాంస్ సెల్యూలాయిడ్ బ్యానర్లపై రాజేష్ దండ, శివ బొమ్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా దీపావళి పండగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. మంగళవారం నగరంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'కె-ర్యాంప్' అన్ని వయసుల ప్రేక్షకులను అలరించే ఒక యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్. సినిమాను చూసి చాలా ఎంజాయ్ చేశాం. కథలోని ఫన్ సెట్స్‌లో కూడా ఉంది. ఇది ఫ్యామిలీ అంతా కలిసి చూడదగిన చిత్రం. హీరోయిన్ యుక్తికి హీరోతో సమానమైన ప్రాధాన్యత ఉన్న పాత్ర దక్కింది. గత దీపావళికి వచ్చిన సినిమాల్లాగే, ఈసారి 'కె-ర్యాంప్' కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని గట్టిగా నమ్ముతున్నాం' అని అన్నారు.



# వణికిస్తున్న వంతెనలు

- అధికారుల మధ్య సమన్వయ లోపం
- నిర్వహణపై అంతులేని నిర్లక్ష్యం
- గోతుల్లో పడి గాయాల పాలవుతున్న వాహనదారులు
- మరమ్మతులకు నోచుకోని వైనం



కొత్తూరు రైల్వే వంతెనపై గోతుల్లో తేలిన ఇనుప ఊచలు

**తుమ్మపాల:** వంతెనల నిర్వహణను అధికారులు గాలికొదిలేయడంతో చాలా వరకు పటిష్టత కోల్పోయి ప్రమాదకర స్థితికి చేరాయి. మండలం, పట్టణంలో రైల్వే వంతెనలు, శారదానది పరివాహక ప్రాంతాలను దాటే వంతెనలు సైతం ఏళ్ల నాటి నుంచి భారీ గోతులతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వర్షాలతోపాటు భారీ వాహనాల రాకపోకలతో గోతులు మరింత దారుణంగా తయారయ్యాయి. వీటిపై ఇనుప ఊచలు కూడా తేలియాడుతున్నాయి. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో కొన్ని చోట్ల వంతెనలపై ఏర్పడిన గోతుల్లో ద్విచక్ర వాహనాలు పడటంతో ఇనుప ఊచల్లో ఇరుక్కు పోవడంతో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో కొత్తూరు, జీవీఎంసీ పరిధిలో కొప్పాక, శంకరం రైల్వే వంతెనలపై అనేక మంది ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారు. అయినప్పటికీ స్థానిక పంచాయతీ, జీవీఎంసీ అధికారులు సమన్వయలోపంతో నిర్వహణ గాలికొదిలేస్తున్నారు.

**ఇరువైపులా భయంకరంగా ఫుట్‌పాత్‌లు...**

జీవీఎంసీ పరిధిలో కొప్పాక వంతెన, శంకరం, కొత్తూరు రైల్వే వంతెనలకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు భయంకరంగా ఉన్నాయి. నడకదారికి అనువైనవిగా ఉండే ఫుట్‌పాత్‌లపై భారీ గోతులు, పిచ్చి మొక్కలు, వంతెనలపై రక్షణ గోడలు ధ్వంసమై ఉన్నాయి. అదుపు తప్పితే అంతే అన్న విధంగా రక్షణ గోడలు విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. శంకరం వంతెనపై ఏడాది క్రితం కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్వచ్ఛత కార్యక్రమం చేపట్టి ఫొటోలకు ఫోజులిచ్చి చేతులు దులుపేసుకున్నారు. కొప్పాక వంతెనపై వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలతో దుమ్ము, ధూళితో వాహనదారులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. కొత్తూరు వంతెనపై మైనింగ్ వాహనాల తాకిడితో ఫుట్‌పాత్‌పై నడిచి వెళ్లే ప్రజలు, విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.



శంకరం రైల్వే వంతెనపై శిథిలమైన రక్షణ గోడ



కొత్తూరు వంతెనపై గోతులమయంగా మారిన ఫుట్‌పాత్

**నియంత్రణ లేని వంతెనలు...**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం మొదలు ప్రశాంత వాతావరణంలో ఉన్న మండలం మైనింగ్‌కు కేరాఫ్‌గా మారిపోయింది. వందలు, వేల సంఖ్యలో మైనింగ్ టిప్పర్లు పరిమితికి మించి తిరుగుతున్నాయి. గ్రామాల్లో రోడ్లతోపాటు వంతెలు దారుణంగా దెబ్బతిన్నాయి. వంతెనలపై అనేక పర్యాయాలు మైనింగ్ టిప్పర్ల కారణంగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో పోలీసులు, సంబంధిత అధికారులు ఇండికెటర్లు పెట్టి సరిపెడుతూ చేతులు దులుపుకుంటున్నారు. మైనింగ్ టిప్పర్ల నియంత్రణపై అదుపు చేయలేని అధికారులు నిర్లక్ష్యంతోనే వంతెనలు శిథిలమైపోతున్నాయి. ఐదేళ్ల కూటమి ప్రభుత్వంలో వంతెనలు కూలిపోయే ప్రమాదం కూడా ఉందంటూ వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

### లోడింగ్ టిప్పర్లతో గోతులు



నిత్యం మైనింగ్ వాహనాలు తిరగడంతో వంతెనలపై భారీ గోతులు ఏర్పడుతున్నాయి. చిన్నచిన్న మరమ్మతులు చేపట్టిన పరిమితికి మించి లోడింగ్‌తో టిప్పర్లు రావడంతో మళ్లీ గోతులు వస్తున్నాయి. దీంతో చిన్న పిల్లలతో వాహనాలపై వచ్చే వారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెనపై ఏర్పడిన గోతుల్లో ఇనుప ఊచలు సైతం బయటకొచ్చి వాహనాలకు తగులుతున్నాయి. మండలంలో అన్ని వంతెనలు ఇదే పరిస్థితి ఉంది. శంకరం వంతెనపై ప్రయాణిస్తే ఊగుతుంది.

–బి.నితీష్, ద్విచక్ర వాహనదారుడు, అనకాపల్లి

## క్లుప్తంగా

### ఉన్నత చదువులతో అభివృద్ధి



మాట్లాడుతున్న డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ మంగమ్మ

**అనకాపల్లి టౌన్:** ఇల్లాలి చదువు ఇంటికి వెలుగని, అందువల్ల ఆడపిల్లలు తప్పనిసరిగా ఉన్నత చదువులు చదవాలని డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ బి. మంగమ్మ తెలిపారు. మండలంలోని తుమ్మపాల జెడ్పీహెచ్ స్కూల్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో సేవ్ ది గర్ల్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో అనేక మంది మహిళలు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఆడపిల్లలకు ఉన్న చట్టాలు, హక్కులుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుధ, ఏఎన్ఎం ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### స్క్రాప్ వాహనాలతో ఇబ్బందులు



గుండాల జంక్షన్ వద్ద రహదారిపై స్క్రాప్ వాహనాలు

**అనకాపల్లి:** మండలంలో తుమ్మపాల పంచాయతీ గుండాల జంక్షన్ వద్ద పాత ద్విచక్రవాహనాలు (స్క్రాప్) రహదారిపై వదిలేయడంతో అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### సొసైటీలో అవకతవకలపై ఫిర్యాదు

**అనకాపల్లి:** మండలంలో వెంకుపాలెంలో విశాఖ పాల సొసైటీలో అవకతవకలపై జూన్‌లో కలెక్టర్‌కు, విశాఖ పాల డైయిరీ చైర్మన్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు సొసైటీ రైతులు ఆడారి వెంకటఅప్పారావు, పీలా జగ్గఅప్పారావు, రాపేటి జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఈ నెల 10న సొసైటీ నిర్వాహకులకు, ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేశారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 11న విచారణకు సొసైటీ నిర్వాహకులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. దాంతో యలమంచి సొసైటీ అధికారి నాగేశ్వరరావు విచారణ చేయకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారన్నారు.

### స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

**రావికమతం:** కొత్తకోట హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థినులకు వృత్తి విద్యా –స్వయం ఉపాధి కోర్సుల్లో నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ పథకం కింద బాలికలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ పరిజ్ఞానం, రైల్వే రిజర్వేషన్ టికెట్ బుకింగ్, ఆన్‌లైన్ సర్వీసులపై అవగాహన కల్పిస్తూ పది మంది విద్యార్థులు శిక్షణ పొందారని హెచ్ఎం జేజే రాజ్‌కుమార్ చెప్పారు. ఒకేషనల్ ట్రైనర్ ఎస్.మీనాక్షి విద్యార్థులకు వృత్తి నైపుణ్యంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలతోపాటు స్వయం ఉపాధికి వృత్తి నైపుణ్య శిక్షణ దోహదపడుతుందని చెప్పారు.

## బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 205 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 4,700 | 5,600 |
| రెండో రకం | 4,000 | 4,570 |
| మూడోరకం | 3,830 | 3,980 |

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా:ఇడ్లీ కొట్టు( ఉదయం, మధ్యాహ్నం) | |
| రాజా | : శశివదనే(ఫస్ట్, సెకండ్ షో) |
| సత్యనారాయణ స్క్రీన్-1 | : కాంతార |
| సత్యనారాయణ స్క్రీన్-2 | : టీఆర్ఓఎన్ ఏఆర్ ఈఎస్(తెలుగులో) |
| పర్తిసాయి | : ఓజీ |
| షిర్డీసాయి | : అరి |
| వెంకటేశ్వర | : కానిస్టేబుల్ |
| రామచంద్ర | : మిరాయ్ |

## రక్త నిల్వలు

**అనకాపల్లి:** ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 73 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్–16, బీ పాజిటివ్–25, ఓ పాజిటివ్–26, ఏబీ పాజిటివ్–6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

## గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 351 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924–223595)ని సంప్రదించవచ్చు.

## ఎరువుల కొరతపై రైతుల ఆందోళన



ఎరువుల కోసం ఆందోళన చేస్తున్న రైతులు

**అచ్యుతాపురం రూరల్:** ఉప్పవరం పంచాయతీ రైతు సేవా కేంద్రం వద్ద రైతులు మంగళవారం ఎరువుల కోసం ఆందోళన చేశారు. వరి సాగుకు అవసరమైన ఎరువులు అందట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఎరువుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నరేంద్రపురం, యర్రవరం, మశ్ళవరం గ్రామాల రైతులు యూరియా కోసం ఎండలో బారులు తీరారు. పొలాల్లో పనులు మానుకుని మరీ ఎరువుల కోసం మండుటెండలో వేచి ఉన్నా ప్రయోజనం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## సమ్మె కరపత్రం విడుదల

**పరవాడ:** విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి కార్మికులు చేయనున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలో సబ్‌స్టేషన్ వద్ద సమ్మె కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే క్యాడర్, ఒకే వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 22వ పీఆర్సీ ఎరియర్స్, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. నాన్ రెగ్యులర్ ఉద్యోగులు అందరికీ అన్‌లిమిటెడ్ వైద్య సౌకర్యం, రూ.కోటి ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు చెల్లించాలని కోరారు.

## సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించాలి



గోడపత్రిక విడుదల చేస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు, తదితరులు

**అనకాపల్లి టౌన్:** విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలని డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు సూచించారు. స్థానిక జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు 2025 గోడపత్రికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడం వల్ల శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవచ్చన్నారు. ఇందుకు ఈ సంబరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పి. వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో 30 సంవత్సరాలుగా చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 18న మండల స్థాయి, నవంబర్ 1, 23 తేదీల్లో జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో ఈ సంబరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో కార్యాలయాధికారి వెంకటేశ్వరావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె. త్రిమూర్తులు, ఉమామహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## సర్క్యులర్ నిలుపుదలపై హర్షం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి

**అనకాపల్లి:** వీవోఏ(విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్)ల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను ప్రభుత్వం నిలుపుదల చేసిందని ఏపీ వెలుగు వీవోఏ యానిమేటర్ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వీవోఏల మూడు సంవత్సరాల కాలపరిమితిని రద్దు చేయాలని ఎన్నో పోరాటులు చేశామన్నారు. జిల్లాలో 1,292 మంది వీవోఏలు 39,579 స్వయం సహాయక సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, వీవోఏలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి కృషి



ప్రకృతి వ్యవసాయ ద్రవ్యాలు, కషాయాల తయారీపై బయో రిసోర్స్ పర్సన్లకు నిర్వహిస్తున్న శిక్షణ



మండల ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో ద్రవ్యాలు, కషాయాలపై అవగాహన

- జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి లచ్చన్న

**కశింకోట:** ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం అధికారి సిహెచ్. లచ్చన్న తెలిపారు. మండల ప్రకృతి వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ ఆధ్వర్యంలో మండలంలోని సుందరయ్యపేటలో అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన 55 మంది ప్రకృతి వ్యవసాయం వనరుల బయో రిసోర్స్ పర్సన్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయానికి వినియోగించే కషాయాలు, ద్రావణాల తయారీపై శిక్షణ ఇచ్చారు. దీన్ని పరిశీలించిన సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయిలో రైతులకు వివరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి మిగిలిన రైతులను ప్రకృతి వ్యవసాయ సాగు పట్ల ఆకర్షితులను చేయాలన్నారు. 9వ బ్యాచ్‌కు నాలుగు రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో భూమి సారవంతానికి, పంటల దిగుబడి, చీడపీడలు, పురుగుల నివారణకు వినియోగించే ఘన, ద్రవ జీవామృతం, 12 రకాల కషాయాలు, ద్రవ్యాల తయారీపై సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. డ్రోన్ ద్వారా వరి పంటపై ద్రావణాలు పిచికారీ చేయడంపై అవగాహన కలిగించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎస్ఎఫ్ఏ సత్తిరాజు, ఎల్ 1లు డి. రమణ, గంటా వెంకటఅప్పారావు, రామగోవింద, డి. వెంకటలక్ష్మి, డి. వరలక్ష్మి, ఐసీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

## వరిలో పొడతెగులు

- నివారణకు ఏడీఆర్ సూచనలు



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

**అనకాపల్లి:** వరిలో పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ లేదా ప్రొపికొనజోల్ 1 మి. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. వరిలో అగ్గితెగులు గమనిస్తే ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా ఐసోప్రోతయోలేన్ 1.5 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వరిలో బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు ఆశించవచ్చని, కాపర్ హైడ్రోక్సైడ్ (కోసైడ్) 30 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రా. 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సుడిదోమ నివారణకు అసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే పైమెట్రోజీన్ 0.6 గ్రా.లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగ, ఆకు ముడతపురుగు ఆశిస్తే, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 2 గ్రా. లేదా అసిఫేట్ 1.5 గ్రా. తల్లిపురుగు లేక గుడ్ల సముదాయం కనిపించినట్లయితే ఎకరాకు 8 కిలోల కార్టాన్ హైడ్రోక్లోరైడ్ 4జిమ గుళికలను వేయాలి. లేదా 4 కిలోల క్లోరాంత్రనిలిప్రోల్ గుళికలను 8 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. అంకురం దశలో ఉన్న వరి పైరుకు మూడో దఫా యూరియాను ఎకరానికి 25 కిలోల చొప్పున, 17 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను బురద పదును చూసుకుని సమానంగా జల్లాలి. కందిలో వడలు తెగులు గమనించినట్లయితే, కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రా. చొప్పున కలిపి మొక్కల మొదళ్ల తడిచేల పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరీ, సీహెచ్.రామలక్ష్మి, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



భర్నికంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ చంద్రశేఖర్

**పరవాడ:** పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరతను నివారించడానికి చర్యలు తీసుకుంటామని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మోపాడ చంద్రశేఖర్ అన్నారు. వాడచీపురుపల్లి, రావాడ, భర్నికం గ్రామాల్లో అమలు జరుగుతున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వాడచీపురుపల్లి పశు వైద్యశాలలో సిబ్బంది కొరతను గుర్తించామని, త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రావాడ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పరవాడ పశుసంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణ కీర్తి, వాడచీపురుపల్లి పశువైద్యులు డాక్టర్ సురేష్‌కుమార్, సిబ్బంది కల్యాణి, లక్ష్మణ్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పెందుర్తి రైల్వే స్టేషన్‌లో 6.8 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్ట్



నిందితులు, గంజాయితో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది

**పెందుర్తి:** ఏవోబీ ప్రాంతం నుంచి రైల్లో ఇతర ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. వారి నుంచి రూ.40 వేలు విలువైన 6.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. ప్రకాశం జిల్లాకు చెందిన కువ్వవరపు వినీల్‌కుమార్, షేక్ సలీ రైల్లో పెందుర్తి రైల్వే స్టేషన్ వరకు గంజాయిని తీసుకువచ్చారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది మాటు వేసి వారిని పట్టుకున్నారు. అనంతరం పెందుర్తి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. దాడిలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్ఐలు ఎస్.శ్రీనివాస్, సీహెచ్ రాజేశ్వరి, ఎల్.అరుణకుమారి, పి.అప్పారావు, హెచ్‌సీ కె.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'సీజేఐపై దాడి హేయం'



సీజేఐ గవాయ్‌పై దాడికి నిరసన తెలుపుతున్న సీఐటీయు నాయకులు

**పరవాడ:** దేశ అత్యున్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మతోన్మాది దాడి హేయమైందని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. సీజేఐపై దాడికి నిరసనగా లంకెలపాలెం కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలపై ప్రత్యక్షంగా పరోక్షంగా దాడి చేయడంతోపాటు వారి హక్కులను హరిస్తున్నారన్నారు ఈ దుర్మార్గాలను ఎదిరిస్తున్న వారిపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ దాడిని రాజ్యాంగంపై దాడిగానే పరిగణిస్తున్నామన్నారు. సీఐటీయూ నాయకులు కె.వెంకటరావు, పెంటారావు, రమణ పాల్గొన్నారు.

## 18న సామాజిక న్యాయం సదస్సు

**రోలుగుంట :** ఈనెల 18న విశాఖపట్నంలో జరగనున్న సామాజిక న్యాయం ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ సంఘ సభ్యులతో కలసి రోలుగుంటలో మంగళవారం పోస్టర్‌ను కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఇ.చిరంజీవి ఆవిష్కరించారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం ఆపాలన్నారు.

## ఉత్సాహంగా గుర్రాల పరుగు పోటీలు



జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న రావాడ నాయుడు



పరుగు పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం

**నాతవరం:** డి.యర్రవరంలో నల్లకొండమ్మ తల్లి పండగ నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. మొత్తం 16 గుర్రాలు పాల్గొన్నాయి. విజేతలకు నిర్వాహకులు నగదుతో పాటు అమ్మవారి షీల్డు అందజేశారు. విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.12వేలు, రూ.10 వేలు,రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. పాల్గొన్న మిగిలిన గుర్రాల యజమానులకు రూ.2వేలు చొప్పున నగదు, షీల్డు అందజేశారు. పోటీలను నర్సీపట్నం చెందిన జ్యాయలరీ వ్యాపారి రావాడ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు.

## క్రమశిక్షణతో గొప్ప నాయకులుగా రాణింపు



ప్రసగిస్తున్న రేపల్లె శ్రీరామారావు

**మద్దిలపాలెం:** యువతరం నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఓఎన్జీసీ సీజీఎం రేపల్లె శ్రీరామారావు సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మంగళవారం ప్రసంగించారు. నాయకుడిగా రాణించాలనుకునే వ్యక్తులు ముందుగా స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే వారు గొప్ప నాయకులుగా నిలుస్తారని చెప్పారు. క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ప్రధానమని సూచించారు. అబ్రహాం లింకన్, వివేకానంద జీవితాలను ఉదహరిస్తూ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన నాయకత్వ లక్షణాలు వివరించారు. యువతరం భవిష్యత్ భారతావనిని ఉన్నతంగా తీర్చిదిద్దే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతోపాటు బహుముఖ ప్రజ్ఞ, నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం మాట్లాడుతూ మార్గనిర్దేశం చేస్తూ ఇతరులను ముందుకు నడిపించే వాడే నాయకుడిగా నిలుస్తాడని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథి శ్రీరామారావును కళాశాల తరపున సన్మానించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీల్లో మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ

**దాబాగార్డెన్స్:** ఈ నెల 11, 12 తేదీల్లో ఏయూ ఇండోర్ జిమ్నాజియం హాల్లో నిర్వహించిన ఏయూ అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఫిజకల్ డైరెక్టర్ ఆర్. కిరణ్మయి గెలుపొందిన విద్యార్థినులు సీహెచ్ ఊర్మిళ, టి.ప్రియమణి, హెచ్.ప్రవళిక, సీహెచ్ ప్రేమలత, స్పందన, లక్ష్మి, మోహనప్రియ, హాసిని, మేఘన, రోహిణి, కావ్య, ప్రవంతిని అభినందించారు. కోచ్‌లు ఉమామహేశ్వర్, భగత్‌సింగ్ క్రమం తప్పకుండా శిక్షణ అందివ్వడంతో విజయం సాధించడంతో పాటు గెలుపొందిన టీమ్ నుంచి ప్రియమణి, ప్రవలిక, కావ్య, హాసిని ఈ నెల 27 నుంచి తమిళనాడులో నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయాల కబడ్డీ పోటీలో పాల్గొనే ఆంధ్ర విశ్వ విద్యాలయం టీమ్‌కు ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం వినతి

**రాంబిల్లి(అచ్యుతాపురం):** రాంబిల్లి మండలంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ ద్వారా భూములను తీసుకొని ఇప్పటి వరకూ ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని, తమ తగిన న్యాయం చేయాలని కోరుతూ కృష్ణంపాలెం బాధితులు మంగళవారం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. 2006లో భూములు తీసుకొని పరిహారం ఇచ్చారని, గ్రామ తరలింపులో భాగంగా అమలు చేసే ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నారని వాపోయారు. 2023 సెప్టెంబర్ 9న విడుదల చేసిన జీవో నంబర్ 846 ప్రకారం 32.49 ఎకరాల భూమిని పంచదార్ల రెవెన్యూ పరిధిలో కేటాయించినప్పటికీ అప్పుడు ఎంపిక చేసిన అర్హులను మళ్లీ మార్చారని ఆరోపించారు. 2023 ఎన్యుమరేషన్‌లో అర్హులైన వారిని మళ్లీ 2025లో చేపట్టిన ఎన్యుమరేషన్‌లో అనర్హులుగా మార్చి మళ్లీ కొత్తవారిని చేర్చి లాటరీ పద్ధతిలో ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ కింద దిబ్బపాలెం సెజ్ పరిధిలో ఇళ్ల స్థలాలు ఇస్తామనడం అన్యాయమన్నారు. ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీలో అర్హుల జాబితాను మార్చిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. 2023 ఎన్యుమరేషన్ ప్రకారం గుర్తించిన అర్హులకు పంచదార్లలోనే ఇళ్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పునరావాసం కల్పించే వరకూ గ్రామ పరిధిలోని పాకలు, ఇళ్లు తమ అనుమతి లేకుండా తొలగించవద్దని కోరారు.